కీసరగుట్టలో జల ప్రసాదం కేంద్రాల ప్రారంభం



కీసరగుట్టలో జమ్మిచెట్టు మొక్క నాటుతున్న మాజీ సర్పంచ్ మాధురి తదితరులు

రూ.32 లక్షలతో దివిస్ లేబోరేటరీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు

కీసర: శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో దివిస్ లేబోరేటరీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జల ప్రసాదాన్ని ఆలయ చైర్మన్ నాగలింగం శర్మ, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కట్ట సుధాకర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామివారిని దర్శించేందుకు నిత్యం వేల మంది భక్తులు ఇక్కడికి వస్తుంటారని వారి సౌకర్యార్థం దివిస్ యాజమాన్యం రూ. 32 లక్షలతో రెండు కేంద్రాలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఆలయ అభివృద్ధితో పాటు, భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వంతో పాటు, దివిస్ సీఎండీ దివి మురళీకృష్ణ సహకారం అందిస్తున్నార న్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఫౌండర్ సభ్యులు తటాకం నారాయణ, తటాకం వెంకటేశ్, ఆలయ సిబ్బంది, లైసెన్ ఆఫీసర్ కిశోర్‌కుమార్, సీహెచ్ శ్రీనివాసులు, ఎస్. సాయికృష్ణ పాల్గొన్నారు.

గుట్టలో నాటిన జమ్మిచెట్టు..

మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ సహకారంతో కీసరగుట్ట దేవస్థానం నందు కీసర మాజీ సర్పంచ్ ఎస్.మాధురి, జమ్మిచెట్టు మొక్కను సోమవారం నాటారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జల ప్రసాదం కేంద్రాలను ప్రారంభిస్తున్న ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి

గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు



గోధుమకుంట గ్రామంలో సభ్యత్వ నమోదులో బీజేపీ, మేడ్చల్ జిల్లా ఓబీసీ మోర్చా నేతలు

కీసర: ఓబీసీ మోర్చా మేడ్చల్ రూరల్ జిల్లా గొర్ల కాపరుల సెల్ కన్వీనర్ చీర సురేశ్ కుర్మ ఆధ్వర్యంలో గోధుమకుంట, కీసర గ్రామాల్లో సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ అధ్యక్షుడు మహేందర్ యాదవ్, ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఓబీసీ మోర్చా గొర్ల కాపరుల సెల్ రాష్ట్ర కోకన్వీనర్ గొంగళ్ల రాజా రమేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గొంగళ్ల మహేశ్‌కుర్మ, ఆంజనేయులు, కోల బాల్‌రాజ్‌యాదవ్, సంతోష్‌రెడ్డి, పవన్‌గౌడ్, ప్రేమ్‌నాథ్, హరీశ్, బాలేశ్, ముత్యంరెడ్డి, శ్రీశైలం, బండి మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి



సాక్షి,సిటీబ్యూరో: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. సమీకృత మేడ్చల్ జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి 60 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇందులో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న మేయర్ శాంతి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 18వ డివిజన్‌లో మున్సిపల్ సాధారణ నిధులు రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులను మేయర్ శాంతి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌ను ఆదర్శవంతమైన కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు కుమార్, సాయి, శేఖర్, శ్రీకాంత్, శ్రీదేవి, కవిత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించలేదని యువకుడిపై దాడి

మేడ్చల్‌రూరల్: పాత ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేసిన యువకుడు నెలవారీ బకాయిలు (ఈఎంఐ) సకాలంలో చెల్లించలేదని సదరు బైక్‌జోన్ యాజమాన్యం యువకుడిపై దాడికి పాల్పడిన ఘటన మేడ్చల్ పట్టణంలో సోమవారం జరిగింది. బాధితుడి వివరాల ప్రకారం.. భద్రాచలంకు చెందిన ఉదయ్ ఉద్యోగం కోసం మేడ్చల్‌కు వచ్చి నివాసం ఉంటున్నాడు. గత మార్చిలో ఉదయ్ మేడ్చల్ పట్టణంలోని ఆదిత్య బైక్ జోన్‌కు వెళ్లి స్థానికుడి పూచీకత్తుతో కొంత డబ్బులు చెల్లించి పాత బైక్‌ను కొనుగోలు చేశాడు. మిగిలిన డబ్బును వాయిదాల రూపంలో (ఈఎంఐ) చెల్లిస్తానని తెలిపాడు. మొదటి నెల ఈఎంఐ చెల్లించిన ఉదయ్ తర్వాత సొంత ఊరికి వెళ్లడం, తన మొబైల్‌ఫోన్ పాడవ్వడంతో నాలుగు నెలల పాటు బకాయి పడింది. గత నెలలో మేడ్చల్‌కు వచ్చి కొంత డబ్బును పూచికత్తు పెట్టిన సంతోష్‌కు ఇచ్చి చెల్లించాలని కోరగా అతడు కట్టాడు. కాగా తమకు బకాయి ఉన్న పూర్తి డబ్బులు చెల్లించాలంటూ ఆదిత్య బైక్ జోన్ యజమాని, సిబ్బంది ఉదయ్‌పై ఒత్తిడి చేశారు. మా అమ్మ అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉందని తాను కూడ ఇక్కడే ఉన్నానని కొద్ది రోజులు సమయం ఇవ్వాలని కోరగా అందుకు అంగీకరించని బైక్ జోన్ సిబ్బంది సోమవారం ఆస్పత్రి వద్ద ఉన్న ఉదయ్ వద్దకు వెళ్లి పట్టుకుని మేడ్చల్‌లోని తమ బైక్ జోన్ కార్యాలయానికి తీసుకువచ్చారు. పూర్తి డబ్బులు చెల్లించే వరకు ఇక్కడి నుంచి వెళ్లేది లేదంటూ యజమాని సీతారాం బాధితుడిపై దాడి చేసి 2 గంటల పాటు అక్కడే నిర్బంధించాడు. బాధితుడి స్నేహితుడు మేడ్చల్ పోలీసులకు సమాచారం ఇచ్చి ఓ కానిస్టేబుల్‌ను తీసుకెళ్లగా బైక్ జోన్ యాజమాన్యం బాధితుడిని వదిలిపెట్టారు. ఉదయ్ ఫిర్యాదు మేరకు మేడ్చల్ పోలీసులు బైక్ జోన్ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూతన పారిశ్రామికవేత్తలకు టీ హబ్ సహకారం



మాట్లాడుతున్న టీఐఎఫ్ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి

మల్లాపూర్: యువ పారిశ్రామికవేత్తలకు టీహబ్, ప్రభుత్వం పరంగా అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. సోమవారం నాచారం ఇండస్ట్రీస్ అసోసియేషన్, టీ హబ్ సంయుక్తాధ్వర్యంలో నాచారం పారిశ్రామికవాడలో సూక్ష్మ, చిన్న మధ్య తరహా పారిశ్రామికవేత్తలు, స్టార్టప్ ప్లీనరీ సమ్మిట్ నిర్వహించారు. ఈ సమావేశానికి పలువురు పారిశ్రామిక వేత్తలు హాజరయ్యారు. టీ హబ్ సీఈఓ శ్రీనివాస్, రాజేష్ అడ్లా మాట్లాడుతూ.. యువ పారిశ్రామికవేత్తలు కొత్త టెక్నాలజీతో నిరుద్యోగులకు ఉపాధి కల్పించవచ్చన్నారు. నూతంగా ఏర్పాటు చేసే కంపెనీలకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తామన్నారు. అనంతరం టీఐఎఫ్ అధ్యక్షులు సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికి నూతనంగా స్టార్టప్‌లు దండు మల్కాపురంలో 589 కంపెనీలను నెలకొల్పి ఉపాధి కల్పిస్తుందన్నారు. 200 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామికవేత్తలు, 170 స్టార్టప్స్ నాచారం ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షులు డీ.కే జైన్, రమేష్, గంభీర్, నాగేంద్రబాబు, పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడులకు కొత్త సార్లు..!



- 9న నియామకపు పత్రాలు అందజేత
- దసరా తర్వాత విధుల్లో చేరనున్న ఉపాధ్యాయులు
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 109 పోస్టులు
- 212 మంది అభ్యర్థుల గుర్తింపు

సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ పాఠశాలలకు నూతన ఉపాధ్యాయులు రానున్నారు. ఇందుకోసం జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించి డీఎస్సీ–2024 ఫలితాల్లో ఎంపికైన అభ్యర్థుల ధ్రువీకరణపత్రాల పరిశీలన పూర్తయింది. మల్కాజిగిరి జడ్పీటీహెచ్‌ఎస్ (బాలుర) పాఠశాలలో ఈ నెల 1 నుంచి ఎస్‌జీటీ 1:3 సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను నిర్వహించారు. మొదటిరోజు 1:3 ప్రకారం ఎంపికైన జాబితా విడుదల ఆలస్యం నేపథ్యంలో 2 నుంచి జిల్లా విద్యాశాఖ అధికారులు పరిశీలన కార్యక్రమాన్ని చురుగ్గా చేపట్టారు. ఇందులో ఎంఈఓలు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 109 పోస్టులకు 226 మంది అభ్యర్థుల ధ్రువీకరణపత్రాలను పరిశీలించగా, 212 మంది అర్హత సాధించినట్లు సమాచారం. ఇందులో 1:1 ప్రకారం అర్హుల జాబితాను రూపొందించి జిల్లా విద్యాశాఖ ప్రభుత్వానికి నివేదించనుంది.

ఈనెల 9న నియామక పత్రాలు అందజేత..

దసరా సెలవుల నేపథ్యంలో ఈ నెల 15న పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్నాయి. ధ్రువీకరణపత్రాల పరిశీలన పూర్తి కావడంతో అర్హులైన వారికి ఈ నెల 9న నియామక పత్రాలు అందజేయనున్నారు. నూతన ఉపాధ్యాయులు దసర సెలవుల అనంతరం విధుల్లో చేరి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించనున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న చాలా మంది ఎస్టీటీ ఉపాధ్యాయులు ఎస్ఏలుగా ప్రమోషన్ పొందడంతో ఆయా చోట్ల ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. ప్రస్తుతం డీఎస్సీ ద్వారా ఖాళీల భర్తీ జరుగుతుండడంతో ఉపాధ్యాయుల కొరత చాలా వరకు తీరనున్నది. మరోవైపు సర్దుబాటు ప్రక్రియ చేపట్టే అవకాశముండడంతో విద్యా వ్యవస్థ ఇక గాడినపడనున్నది.

109 పోస్టుల భర్తీ కోసం...

సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తర్వాత మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఖాళీ స్థానాల్లో భాగంగా 1:3 నిష్పత్తి ప్రకారం గుర్తించిన అభ్యర్థుల జాబితా ఇలా ఉన్నట్లు తెలుస్తోంది. మేడ్చల్ జిల్లాలో 109 ఖాళీలకు 1:3 నిష్పత్తిలో 212 మంది అర్హత సాధించిన అభ్యర్థులను గుర్తించారు. వాటి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని 51 ఎస్జీటీ ఖాళీలకు గాను 1:3 నిష్పత్తి ప్రకారం 107 మంది అభ్యర్థులను, 26 ఎస్ఏ పోస్టులకుగాను 78 మంది, 8 ఎల్‌పీ పోస్టులకు గానూ 24 మందిని, ఒక పీఈటీ పోస్టుకు గానూ ముగ్గురిని గుర్తించినట్లు సమాచారం. అలాగే 1:1 నిష్పత్తి ప్రకారం తుది జాబితాను రూపొందించి జిల్లా విద్యాశాఖ మంగళవారం లోగా ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే బుధవారం అర్హులైన వారికి నియామకపు పత్రాలను ప్రభుత్వ పెద్దలు అందజేయనున్నారు.

అక్రమంగా పటాకులు విక్రయిస్తున్న వారిపై కేసు

ఘట్‌కేసర్: అనుమతుల్లేకుండా పటాకులు విక్రయిస్తున్న దుకాణం యజమానిపై ఘట్‌కేసర్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. అడ్మిన్ ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని జడ్పీ బాలుర పాఠశాల ఎదురుగా దుకాణంలో పటాకులు విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో దాడి చేసి దుకాణంలో రూ. 10 వేలువైన 17 రకాల పటాకుల ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. యజమాని దంబాడి యాదమ్మను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మేడ్చల్‌రూరల్: నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల.. ప్రకారం మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి గిర్మాపూర్‌కు చెందిన సత్యనారాయణ (70) సోమవారం ఉదయం తన పొలం వద్దకు వెళ్లేందుకు గిర్మాపూర్ నుంచి రాయిలాపూర్ వైపు నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదేసమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాల పాలైన సత్యనారాయణను చికిత్స కోసం స్థానిక సీఎంఆర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. ఈ మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు

బోడుప్పల్: కృషి, పట్టుదలతో పాటు కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని 14వ డివిజన్ కార్పొరేటర్ కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ 14వ డివిజన్ పరిధిలోని ఆర్ఎన్ఎస్ కాలనీలో నివసించే సునీత, నరేష్ కుమార్తె శివ జ్యోతిక జోగులాంబ గద్వాల్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. అదే కాలనీకి చెందిన శివాణి మెడికల్ సీటులో అర్హత, వెంకట్‌రెడ్డి కాలనీలో నివసించే రేణుగుంట స్వాతి రఘునంద డీఎస్సీ పరీక్షలో సిద్దిపేట జిల్లాలో 2వ ర్యాంక్‌ను పొందింది. ఈ సందర్భంగా వారిని కార్పొరేటర్ సత్కరించి అభినందించారు.

సద్దుల బతుకమ్మకు వేళాయె..!

- నేడు మేడ్చల్‌లో బతుకమ్మ సంబురాలు
- ఏడు రోజులకే నిర్వహించడం ఆనవాయితీ

మేడ్చల్: సద్దుల బతుకమ్మ సంబురాలకు మేడ్చల్ ముస్తాబైంది.పెత్తర అమవాస్యకు ప్రారంభమయ్యే సద్దుల బతుకమ్మ వేడుకలు తొమ్మిది రోజుల పాటు నిర్వహించడం ఆనవాయితీ. అయితే మేడ్చల్(పాత గ్రామం)లో మాత్రం ఏడు రోజులకే నిర్వహిస్తుంటారు.

దొంగల భయం తప్పించుకునేందుకే..

నిజాం కాలంలో రాష్ట్రమంతటా 9 రోజులకు బతుకమ్మ పండగను నిర్వహిస్తుండగా ఆ రోజు మహిళలు పట్టుచీరలు ధరించి బంగారు నగలు పెట్టుకుని వీధుల్లోకి వచ్చేవారు. అయితే రజాకార్లు, దోపిడీ దొంగలు హైదరాబాద్‌కు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో చొరబడి పండగ పూట దొపిడీలు చేసే వారని మేడ్చల్‌కు చెందిన చరిత్రకారులు తెలిపారు. వారి బారి నుంచి తప్పించుకునేందుకు రజాకార్లకు తెలియకుండా పండగను ఏడు ఏడు రోజులకే నిర్వహించేవారని, అదే ఆనవాయితీ ఇప్పటికీ కొనసాగుతోందని తెలిపారు.



ఘట్‌కేసర్‌లో అమ్మవారిని దర్శించుకున్న ప్రీతీరెడ్డి, మాధవరెడ్డి



ఎదులాబాద్‌లో చైర్ పర్సన్ పావనీజంగయ్య..

కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్రులు



ఎన్ఎఫ్‌సీనగర్‌లో అన్నపూర్ణ దేవీ అవతారంలో..



గుండ్లపోచంపల్లిలో మహాచండీ దేవీగా ..



లలితా త్రిపుర సుందరిదేవీగా కీసర గుట్ట అమ్మవారు



అన్నపూర్ణ దేవీగా గడి మైసమ్మ అమ్మవారు..

మేడ్చల్ జిల్లావ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు, చండీహోమం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే పలువురు ప్రజాప్రతినిధులు మండపాల వద్ద అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

– మేడ్చల్ జోన్ బృందం



పూడూర్‌లో పూజల్లో భక్తులు..

మొక్కల సంరక్షణ గాలికి..!

- ఏటా లక్షల్లో నాటుతున్న మొక్కలు
- మొక్కకు రూ.40 నుంచి రూ.110 ఖర్చు
- ఒక్కో గుంతకు రూ.46 నుంచి రూ.56 వెచ్చింపు
- పర్యవేక్షణ, పట్టింపులేక అంతంతమాత్రంగానే ఫలితం

సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వం ఏటా గ్రామాలు, పట్టణాల్లో రహదారుల వెంట పెద్ద సంఖ్యలో మొక్కలు నాటుతున్నా.. వాటి సంరక్షణకు సరైన చర్యలు తీసుకోకపోవడంతో వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాల పరిధిలో ఈ ఏడాది ఇంటింటికీ, రహదారుకిరువైపులా, ఇతర ప్రాంతాల్లో సుమారు 70 లక్షలకు పైగా మొక్కలు సరఫరా చేసినట్లు అటవీ శాఖ చెబుతోంది. అదనంగా ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యానవన విభాగం కింద మామిడి, జామ, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్, మునగ, సపోట, సీతాఫలం, అల్లనేరేడు, నిమ్మ తదితర మొక్కల కొనుగోలుకు మొక్క రకాన్ని బట్టి రూ. 40 నుంచి రూ. 110 వరకు చెల్లిస్తోంది. మునగ మొక్కకు మాత్రం రూ. 1000 అందజేస్తూ.. ఏడాది పాటు సంరక్షణ బాధ్యతను అప్పగిస్తోంది. మొక్కలు నాటేందుకు అవసరమైన గుంతలు తవ్వేందుకు ఒక్కోదానికి రూ 46 నుంచి రూ.56 వరకు అందజేస్తోంది. మూడేళ్లపాటు సంరక్షణకు ఒక్కో మొక్కకు రూ.12.25 నుంచి రూ.15 వరకు చెల్లిస్తోంది. రహదారులకిరువైపులా, గుట్టల ప్రాంతంలో నాటే మొక్కలను ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద కూలీలకు నిర్ణీత ధరతో మూడేళ్ల సంరక్షణ బాధ్యతను అప్పగించి యేటా 8 నెలలపాటు పనిదినాలు కల్పిస్తోంది. నాటిన మొక్కలు 100 శాతం బతికితే ప్రతిరోజు రూ.272 చొప్పున కూలీ అందజేస్తారు. ప్రధాన రహదారుల పక్కన కిలో మీటరు దూరం వరకు 400 మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను ఉపాధి కూలీలకు అప్పగిస్తుంటారు. పొలాల పక్కన ప్రధాన రహదారులకిరువైపులా నాటిన మొక్కలు ఏపుగా పెరిగితే నీడతోపాటు కోతులు, పక్షులకు ఆవాసం ఉంటాయన్న ఆలోచనతో కొందరు వాటిని నరికివేస్తున్నట్లు ఉపాధి సిబ్బంది పేర్కొంటున్నారు. అంతేగాకుండా కోతుల బెడదతో ఇళ్ల ఆవరణలో నాటిన మొక్కలను కూడా తొలగిస్తున్నారు. ఏటా ఒక్కో మండలంలో మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రభుత్వం దాదాపు రూ.లక్షల్లో నిధులు వెచ్చిస్తోంది.

సంరక్షణపై శ్రద్ధేదీ..?

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఈ ఏడాది 70 లక్షలకు పైగా మొక్కలు నాటినట్లు అటవీశాఖ అధికార వర్గాలు పేర్కొన్నప్పటికీ, ఇందులో చాలా మొక్కలు నాటిన మొక్క పక్కనే మళ్లీ నాటినట్లు తెలుస్తోంది. అలాగే ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేసినట్లు తప్పుడు లెక్కలు కూడా చూపినట్లు ప్రచారం జరుగుతోంది. జిల్లాలో వనమహోత్సవం–2024లో మొక్కలు నాటే లక్ష్యం 63.44 లక్షలు కాగా 70 లక్షలకు పైగా నాటినట్లు నివేదికలు పంపినట్లు తెలుస్తోంది. ఇందులో 70 శాతానికి మించి మొక్కలు నాటకపోవడంతో పాటు సంరక్షణ సరిగ్గా లేదని క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితిని బట్టి తెలుస్తోంది. గతేడాది జిల్లావ్యాప్తంగా 63.90 లక్షల మొక్కలు నాటితే అందులో 90 శాతం బతికినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నా.. ఇందులో 80 శాతం మొక్కలు ఎదిగాయని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. కానీ కాగితాల్లోనే మొక్కల లెక్కలు పక్కాగా ఉంటున్నా.. క్షేత్రస్థాయిలో అనుకున్న పురోగతి లేదనేది ఆయా ప్రాంతాలను పరిశీలిస్తే తెలుస్తోంది. జిల్లాలో 2016లో మొదలైన మొక్కలు నాటే కార్యక్రమం యేటా కొనసాగుతోంది. జిల్లాలో ఇప్పటివరకు దాదాపు 5.70 కోట్ల మొక్కలు నాటినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే గడిచిన కొన్నేళ్లుగా మొక్కలు నాటే విషయంలో మొక్కుబడి తీరే కనిపిస్తోందన్న ఆరోపణలున్నాయి. మొక్కలు సంరక్షణ లేకపోవడంతో అవి ఎండిపోతున్నాయి. దీంతో మరుసటి ఏడాది అదేచోట మొక్కలు నాటుతున్నారు. ఆయా శాఖల వారీగా లక్ష్యాలను కేటాయించినప్పటికీ వాటిని సంరక్షించే విషయాన్ని విస్మరిస్తున్నారు. ఎక్కువ లక్ష్యాన్ని పెట్టి త్వరగా మొక్కలు నాటే తంతును ముగించే కన్నా.. తక్కువ మొత్తంగా లక్ష్యాన్ని ఇచ్చి.. నాటిన ప్రతి మొక్కనూ కాపాడేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రస్థాయి అధికారులు జిల్లాలకు ఆదేశాలిచ్చారు. అయినా పట్టించుకోవడం లేదని తెలుస్తోంది.

వెచ్చిస్తున్నా..నెరవేరని లక్ష్యం

ఏటా దాదాపు లక్షల వరకు మొక్కలు నాటుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలతో నాటించి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నప్పటికీ కొన్నిచోట్ల కోతుల బెడదతో దెబ్బతింటున్నాయి. విద్యుత్ తీగల కింద పెరిగిన చెట్లను నరికివేస్తున్నారు. రహదారుల పక్కన పశువులు మేపడంతో మొక్కలు చనిపోతున్నాయి. నాటిన ప్రతి మొక్క ఏపుగా పెరిగే వరకు సిబ్బందితో పాటు కూలీలు కూడా కృషి చేయాల్సి ఉండగా, పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

మూసేసిన రోడ్లను తెరిపించాలి



ప్రజావాణిలో వినతి పత్రం ఇస్తున్న సభ్యులు

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లిలో గల లోటస్ ఎన్‌క్లేవ్‌లో మూసేసిన రోడ్లను తెరిపించాలని పట్టణంలోని రాఘవేంద్రనగర్ కాలనీవాసులు కోరారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్, డీపీఓ, ఇతర ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందజేశారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎంపీ ఈటల రాజేందర్



పూజలు చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలో నూతనంగా నిర్మించిన ఎర్ర పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనలో సోమవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు హంసరాణీకృష్ణాగౌడ్, మల్లికార్జున్ ముదిరాజ్, సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ మార్కింగ్‌లో అవకతవకలు



నాగారం మున్సిపల్ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న బాధితులు

కీసర: రాంపల్లి నుంచి ఘట్‌కేసర్ వెళ్లే ప్రధాన రోడ్డు విస్తరణకు అధికారులు ఇటీవల చేపట్టిన మార్కింగ్‌లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ బాధితులు నాగారం మున్సిపల్ అధికారులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ రాంపల్లి– ఘట్‌కేసర్ రహదారి విస్తరణలో భాగంగా దక్షిణవైపు ప్లాట్లలో అధిక భాగం కోతకు గురవుతుందని, ఉత్తరం వైపు ప్లాట్లలో ఏ మాత్రం మార్పులు లేకపోవడం ఇందుకు నిదర్శనమన్నారు. అధికారులు వెంటనే స్పందించి ఇరువైపులా సమానంగా కొలతలు చేపట్టాలని కోరారు.